క్లుప్తంగా

వివాహిత ఆత్మహత్యాయత్నం

రాయదుర్గం రూరల్: కుటుంబ కలహాలతో మనస్థాపం చెందిన యువతి క్రిమిసంహారక మందు సేవించి ఆత్మహత్యాయత్నం చేసింది. ఈ సంఘటన మండలంలోని రేకులకుంట గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది . గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. కురుబ ధనుంజయ భార్య కురుబ రేణుకమ్మ వేరుకాపురం పెట్టాలని చాలా రోజులుగా ప్రయత్నిస్తోంది. కుటుంబ సభ్యులు ఒప్పుకోక పోవడంతో మనస్థాపానికి గురైంది. బుధవారం ఉదయం కుటుంబ సభ్యులు పొలం పనులకు వెళ్లగా.. ఎవరూ లేని సమయంలో పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడింది. ఇరుగుపొరుగు వారు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. హుటాహుటిన ఆమెను రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స చేసిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం జిల్లా సర్వజనాసుపత్రికి రెఫర్ చేశారు.

ఘనంగా మారికాంబదేవి కొల్లాపుర మహాలక్ష్మి జాతర



అలంకరణలో మారికాంబదేవి కొల్లాపుర మహాలక్ష్మి దేవి

బొమ్మనహాళ్: మండలంలోని హరేసముద్రం గ్రామంలో మారికాంబదేవి కొల్లాపుర మహాలక్ష్మీ దేవి జాతర బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. బుధవారం వేకువజామున ఆలయం ముందు దున్నపోతును బలిచ్చారు. ప్రభుత్వ విప్ కాపురామచంద్రారెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఈశ్వరరెడ్డి, నాయకులు చంద్రశేఖరరెడ్డి, వైస్ ఎంపీపీ రమేష్, సర్పంచులు తిప్పేస్వామి, యోగేశ్వరరెడ్డి, ఎంసీహెచ్ రాజ్‌కుమార్, ముల్లంగి నారాయణస్వామి, కోటేశ్వరరెడ్డి, నాయకులు ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, నాగిరెడ్డి, వన్నూరప్ప, వన్నూరుస్వామి, రంజిత్, లక్ష్మీనారాయణ, రాముడు, నాయుడు పాల్గొన్నారు.

నేడు మెగాజాబ్ మేళా

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని నిరుద్యోగులకు అనంతపురం పోలీసు శాఖ, పీవీఎస్ఆర్ గ్రూప్స్ సంయుక్త ఆధ్వర్యంలో పరివర్తన పేరుతో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. స్థానిక శ్రీనివాస కల్యాణ మండపంలో గురువారం ఉదయం 8 గంటల నుంచే జాబ్ మేళా జరుగుతుందన్నారు. నిరుద్యోగులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, బయోడేటా ఫాంతో హాజరుకావాలన్నారు.

అనంత సాహితీ శిఖరం 'సింగమనేని'

కళ్యాణదుర్గం: అనంత సాహితీ శిఖరం సింగమనేని నారాయణ అని అనంతపురం డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకుడు అంకె శ్రీనివాస్ అన్నారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో బుధవారం సింగమనేని వర్ధంతి జరిగింది. ఈ సందర్భంగా సింగమనేని నారాయణ సాహిత్యం–సామాజిక దృక్పథం అనే అంశంపై స్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్షుడు నరసింహులు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. అనంత జిల్లాకు ఆయన చేసి సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు శివ ప్రసాద్, తిప్పేస్వామి, నారా నరసింహులు, తిప్పేస్వామి, రాయల్ వెంకటేశులు, మల్లికార్జున గౌడ్, ఫల్గుణ ప్రసాద్, చల్లా కిశోర్ చౌదరి, ఓబుళరాజు పాల్గొన్నారు.

కురుబలను ఎస్టీ జాబితాలో చేర్చాలి



ఎంపీ మాధవ్‌కు వినతిపత్రం అందిస్తున్న కురుబ సంఘం రాష్ట్ర నాయకులు

ఉరవకొండ: ఏపీలో అన్ని రంగాల్లో వెనుకబడిన కరుబ, కురుమ కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఎంపీ గోరంట్లమాధవ్‌ను కురుబ సంఘం నాయకులు కోరారు. బుధవారం ఢిల్లీలోని పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో రాష్ట్ర కురుబ సంఘం యూత్ అధ్యక్షుడు వశికేరి రమేష్, ఉరవకొండ నియోజకవర్గ కురుబ సంఘం అధ్యక్షుడు వశికేరి మల్లికార్జున తదితరులు ఎంపీని కలిశారు. రాజకీయ, ఆర్థికంగా అన్నీ రంగాల్లో వెనుకబడిన కురుబలను ఎస్టీ జాబితాలో చేర్చితే అభివృద్ధి చెందుతారని తెలిపారు.

నేడు సచివాలయ కన్వీనర్లతో సమావేశం

ఉరవకొండ: స్థానిక లత్తవరం రోడ్డులోని తొగటవీర క్షత్రియ కల్యాణ మండపంలో గురువారం నియోజకవర్గ సచివాలయ కన్వీనర్లతో సమావేశం నిర్వహిస్తున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. సమావేశానికి మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి, ఆయన తనయుడు వై.ప్రణయ్ రెడ్డి హాజరవుతారన్నారు.

పేదల కోసం మళ్లీ జగనన్నే సీఎం కావాలి

- ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి



సమావేశానికి హాజరైన డ్వాక్రా మహిళలు

కణేకల్లు: నిరుపేదలు, విద్యార్థులు, అవ్వాతాతల భవిష్యత్తు బాగుండాలంటే మళ్లీ జగనన్నే సీఎం కావాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా అన్నివర్గాల ప్రజలను నిలువునా మోసం చేసిన చంద్రబాబును నమ్మితే తినే కంచంలో మన్ను (మట్టి) వేసుకొన్నట్టేనన్నారు. కణేకల్లులో బుధవారం 'వైఎస్సార్ ఆసరా వారోత్సవాలు' నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన విప్ కాపు.. తొలుత బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. మహిళల అభ్యున్నతే ధ్యేయంగా సీఎం జగన్ పని చేస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటకు కట్టుబడి మహిళలకు వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, అమ్మఒడి తదితర పథకాలను అమలు చేస్తున్నాడన్నారు. వైఎస్సార్ ఆసరా మూడో విడత కింద అక్కచెల్లెమ్మలకు రూ.6,419 కోట్లను వారి అకౌంట్లలో వేయడం జరిగిందన్నారు. నాల్గో విడత ద్వారా మిగిలిన మొత్తాన్ని కూడా ప్రభుత్వం ఇవ్వనుందన్నారు. ఇప్పటి వరకూ వివిధ పథకాల ద్వారా అక్కచెల్లెమ్మలకు రూ.2.25 లక్షల కోట్లు లబ్ధి చేకూర్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు.

మోసం చేసిన బాబు..

2014 ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీలన్నీ నేరవేర్చాడా? లేదా? అనేది ఒక్కసారి ఆలోచించాలన్నారు. రైతుల పంట రుణాల మాఫీ, బంగారు రుణాల మాఫీ, డ్వాక్రా అక్కచెల్లెమ్మల రుణాలు మాఫీ అని చెప్పి మోసం చేశారని ధ్వజమెత్తారు. రుణాలను మాఫీ చేయకుండా అందరిపై పెద్ద బండే వేశారని మండిపడ్డారు. అప్పులకు వడ్డీలకు వడ్డీలు పెరిగి పెనుభారమై రైతులు, అక్కచెల్లెమ్మలు ఎన్నో ఇబ్బందులు పడ్డారన్నారు. ఇంటికో ఉద్యోగం, ఎన్టీఆర్ సుజల స్రవంతి ద్వారా రూ.2లకే 20 లీటర్ల నీరు, మహిళ సభ్యులకు సెల్‌ఫోన్లు, విద్యార్థులకు కంప్యూటర్‌లు ఇలా చెప్పుకుంటూ పోతే దాదాపు 600 హామీలిచ్చారన్నారు. వీటిలో ఏ ఒక్కటి నెరవేర్చలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రంకెలేస్తే ఎవ్వరూ భయపడరు..

అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు చెందాల్సిన సొమ్మును పందికొక్కుల్లా మెక్కిన టీడీపీ నేతలు దున్నపోతుల్లా బలసి రంకెలేస్తే ఎవ్వరూ భయపడరని మండిపడ్డారు. సీఎం జగన్ పేద ప్రజల కోసం రూ.లక్షల కోట్లను నేరుగా ప్రజలకు చేరవేస్తే చంద్రబాబు అండ్‌కో పందికొక్కులా దోచుకున్నారన్నారు. అధికారం కోసం ప్రజలను మభ్యపెట్టేందుకు నోటికొచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదన్నారు. అడ్డదిడ్డంగా మాట్లాడితే ప్రజలే తిరగబడతారన్నారు.

గతంలో రూ.వెయ్యి పింఛన్..

వైఎస్సార్‌సీపీ అధికారంలో రాగానే అవ్వాతాతలకిచ్చే పింఛన్ పెంచుతామని జగన్ చెబితే అప్పటి దాకా వెయ్యి రూపాయలు పింఛన్ ఇచ్చిన బాబు రూ.2 వేలు చేశాడన్నారు. ప్రజలను మోసం చేసేందుకు అలా చేశాడన్నారు. అధికారంలో వచ్చిన వెంటనే రూ.2 వేల పింఛన్ ఎందుకివ్వలేదని ప్రశ్నించారు. 4 సంవత్సరాల 10 నెలల కాలంలో బాబు ఇచ్చింది రూ.1000 పింఛనేనన్నారు. సీఎం జగన్ ఇచ్చిన మాటకు కట్టుబడి దశల వారీగా పింఛన్ పెంచుకుంటూ వెళ్లి.. రూ.2,750లు ఇస్తున్నారన్నారు. త్వరలో రూ.3వేలు పింఛన్ ఇస్తామన్నారు. జగన్ ఉన్నంత వరకూ పింఛన్ పెరుగుతూ పోతుందని భరోసా ఇచ్చారు. రాష్ట్రం అభివృద్ధి చెందడంతో పాటు ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలంటే ప్రతి ఒక్కరు జగన్‌కు అండగా నిలవాలన్నారు.

జగనన్న కాలనీలో నీటి వసతి..

కణేకల్లు: కణేకల్లు శివారులోని జగనన్న కాలనీలో ప్రజల అవసరాల తీర్చేందుకు కొత్తగా వేసిన బోరును ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి బుధవారం ప్రారంభించారు. జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణంతో పాటు తాగునీటి అవసరాల దృష్ట్యా బోరు వేసేందుకు విప్ తన గ్రాంటు నుంచి రూ.4 లక్షలు మంజూరు చేశారు. బోరుతో పాటు, పైప్‌లైన్ పనులు పూర్తి కావడంతో ప్రారంభించారు. నీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ముందుచూపుతో నీటి వసతిని కల్పించడం జరిగిందన్నారు. దశల వారీగా జగనన్న కాలనీలో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. ఆయా కార్యక్రమాల్లో వైకేపీ రాయదుర్గం ఏరియా కో–ఆర్డినేటర్ గంగాధర్, ఎంపీడీఓ పీడీ శ్రీనివాసులు, ఏపీఎం గంగాధర్, మార్కెట్ యార్డు చైర్మన్ భోజరాజనాయక్, జెడ్పీటీసీ డి.పద్మావతి, ఎంపీపీ సంధ్య, వైస్ ఎంపీపీ లీలావతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆలూరు చిక్కణ్ణ, పట్టణ కన్వీనర్ టీ.కేశవరెడ్డి, కార్యదర్శి ఆదిసద్గురు చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచు నిర్మల, వైస్ సర్పంచ్ పి.నబీసా, మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ నాగిరెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు తిమ్మప్ప చౌదరి, మాజీ అధ్యక్షుడు మారెన్న, జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ మాబుపీరా తదితరులు పాల్గొన్నారు.

పథకాలను ఇంటింటికీ వివరించాలి



జగనన్నే మా భవిష్యత్తు పోస్టర్లను విడుదల చేస్తున్న మంత్రి కేవీ ఉషశ్రీచరణ్



రాయదుర్గం: పోస్టర్లను విడుదల చేస్తున్న ప్రభుత్వ విప్ కాపు

- మంత్రి ఉషశ్రీచరణ్, ప్రభుత్వ విప్ కాపు

కళ్యాణదుర్గం: వైఎస్సార్‌సీపీ తల్లితో సమానమని, ఆదరించిన పార్టీకి ద్రోహం చేయకుండా ఆత్మాభిమానాన్ని ప్రతిపక్షాలకు తాకట్టు పెట్టవద్దని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గంలోని అన్ని మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ.. మరోసారి వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిగా చేసుకుందామన్నారు. ఇందుకు ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలును వివరించాలన్నారు. ఇందుకు ప్రత్యేకంగా రూపొందించిన ప్రణాళిక ప్రకారం 'జగనన్నే మా భవిష్యత్తు' పేరుతో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఈనెల 7వ తేదీ నుండి 20వ తేదీ వరకూ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేయకపోతే పార్టీతో పాటు అందరూ నష్టపోతామన్నారు. తొలగించిన పింఛను, రేషన్ కార్డులో జూన్ నాటికి తిరిగి ఇస్తారని మంత్రి చెప్పారు. సచివాలయం, ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్ నిర్మాణ బిల్లులు ఏప్రిల్ నెలాఖరులో కాంట్రాక్టర్ల అకౌంట్లలో జమ అవుతాయని సీఎం జగన్ హామీ ఇచ్చారని మంత్రి చెప్పారు. టీడీపీ నాయకులు ఉన్మాద రాజకీయాలను చేస్తున్నారన్నారు. ఓ వైపు ఉన్నం మారుతీ చౌదరి, మరోవైపు ఉమా మహేశ్వర నాయుడులు తనపై బురదజల్లే యత్నం చేస్తూ నీచపు రాజకీయాలకు తెర లేపారని మండిపడ్డారు. మారుతీ చౌదరికి ఎస్సీ, ఎస్టీ, బీసీలంటే చులకన అని ఎద్దేవా చేశారు. ఇతని బాగోతం తెలిసే చంద్రబాబు టికెట్ ఇవ్వలేదని చెప్పారు. 2014 ఎన్నికల ముందు ఉన్నం ఫ్యామిలీ ఆస్తి ఎంత? ఇప్పుడున్న ఆస్తి విలువ ఎంతో ప్రజలు గమనించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర జానపద, నృత్య అకాడమీ డైరెక్టర్ బాబురెడ్డి, కన్వీనర్లు గోపారం శ్రీనివాసులు, బసవరాజు, సత్యనారాయణ శాస్త్రి, శివన్న యాదవ్, ఎంపీపీలు మారుతమ్మ, చంద్రశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీలు బొమ్మన్న, గుద్దెళ్ల నాగరాజు, మంజునాథ్, రాధాస్వామి, సచివాలయ కన్వీనర్లు అర్చన, ఆంజినేయులు, గంగాధర్, రాము, పెరుగు తిమ్మరాజు, ప్రసాద్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

బాబు దోపిడీని ప్రజలకు వివరిస్తాం

రాయదుర్గం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే పేద కుటుంబాలకు అన్నీ విధాల భరోసా దక్కిందని, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉపేంద్రారెడ్డి, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, మున్సిపల్ వైస్ చైర్మెన్లు శ్రీనివాస్‌యాదవ్, వలీబాషా, పట్టణ కన్వీనర్ ముస్తాక్‌తో కలసి సమావేశం నిర్వహించారు. విప్ మాట్లాడుతూ.. మానమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని రేపటి నుంచి 14 రోజుల పాటు ప్రతిష్టాత్మకంగా నిర్వహించేలా కార్యాచరణ సిద్ధం చేశామన్నారు. చంద్రబాబు ప్రజాధనాన్ని లూటీ చేసి పచ్చ నాయకులకు దోచిపెట్టారని విరుచుకుపడ్డాడు. నీరు–చెట్టు, దోమలపై దండయాత్ర, రెయిన్ గన్లు లాంటి వృథా పథకాలను అమల్లోకి తీసుకొచ్చి రూ.వేల కోట్ల అవినీతికి పాల్పడ్డారని మండిపడ్డారు. టీడీపీ హయాంలో జరిగిన దోపిడీ, మోసాన్ని ఎండగడుతామన్నారు.

కాలవకు కళ్లు నెత్తికెక్కాయి..

టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులుకు కళ్లు నెత్తికెక్కాయని విప్ కాపు ఆరోపించారు. కాలవ హయాంలో జరిగిన ఇసుక, మట్టి దోపిడీ మునుపెన్నడూ చూడలేదన్నారు. పచ్చకామెర్లవాడికి లోకమంతా పచ్చగా కనిపించినట్టు తను చేసిన అవినీతే ఎదుటి వారు కూడా చేస్తారను కోవడం దుర్మార్గమైన చర్య అని అభివర్ణించారు. గత నెల 13న బళ్లారి సమీపాన కాలవ ముఖ్య అనుచరుడు, టీడీపీ నాయకుడు ఇసుక తరలిస్తూ టిప్పర్ పట్టుబడితే దాన్ని తనకు ఆపాదించేలా ఎల్లో మీడియాలో వార్తలు రాయించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కార్యక్రమంలో కో–ఆప్షన్ సభ్యుడు దివాలవర్ బాషా, క్లాస్–1 కాంట్రాక్టర్ సత్యనారాయణ రెడ్డి, కౌన్సిలర్లు శ్రీనివాస్‌రెడ్డి, బషీర్, షబ్బీర్, మాజీ కౌన్సిలర్ వసంత, వార్డు ఇన్‌చార్జులు నాగరాజు, పవన్ పాల్గొన్నారు.

గజేంద్ర వాహనంపై జంబుకేశ్వరుడి వైభవం



రాయదుర్గంటౌన్: స్వయంభూ జంబుకేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి స్వామి గజేంద్ర వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారి గజేంద్ర వాహనం కోట వీధి మీదుగా వినాయక సర్కిల్, లక్ష్మీబజార్ వరకూ కొనసాగి తిరిగి ఆలయం వరకు చేరుకుంది.

నేడు రథోత్సవం : బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం జంబుకేశ్వర స్వామి బ్రహ్మ రథోత్సవం నిర్వహించనున్నట్లు గ్రూపు దేవాలయాల కార్యనిర్వహణాధికారి నరసింహారెడ్డి తెలిపారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకూ మడుగు తేరు, సాయంత్రం 4 గంటలకు రథోత్సవం జరుగుతుందన్నారు.

కమనీయం.. మల్లేశ్వర స్వామి కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

ఉరవకొండ: మల్లేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం స్వామికి అభిషేకం, మంగళహారతి, రుద్రాభిషేకం కార్యక్రమాలు జరిగాయి. అనంతరం అభిజిత్ లగ్నంలో భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి కల్యాణాన్ని వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య కనుల పండువగా సాగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా నేడు రథోత్సవం జరగనుంది.

కాలవ కంత్రీ రాజకీయం

- విప్ కాపుపై దుష్ప్రచారం
- ఇసుక రవాణా పేరిట తప్పుడు ఆరోపణలు
- బళ్లారిలో పట్టుబడిన ఇసుక తెలుగు తమ్ముడిదే!
- అయినా ఎమ్మెల్యేకు ఆపాదించే యత్నం



బళ్లారి పోలీసులు స్వాధీనం చేసుకున్న టిప్పర్

సాక్షి, బళ్లారి/రాయదుర్గం: ఒక అబద్ధాన్ని పదే పదే ప్రచారం చేయడం ద్వారా నిజమని జనాన్ని నమ్మించాలన్నది టీడీపీ నాయకుల ఎత్తుగడ. చంద్రబాబు మొదలుకుని స్థానిక నాయకుల వరకు అందరూ ఇదే వ్యూహంతో ముందుకు వెళుతున్నారు. ఈ విషయంలో ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు రెండాకులు ఎక్కువే చదివారు. రాయదుర్గం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డికి ఎలాగైనా జనంలో చెడ్డపేరు తేవాలన్న దురుద్దేశంతో కాలవ నిత్యం అబద్ధాలు ప్రచారం చేయడమే పనిగా పెట్టుకున్నారు. ఇటీవల కర్ణాటక రాష్ట్రం బళ్లారిలో పట్టుబడిన ఇసుక టిప్పర్ విషయంలోనూ ఇలాగే వ్యవహరించారు. ఈ టిప్పరుతో ఎమ్మెల్యేకు లింక్ పెడుతూ ఇసుక దోపిడీ చేస్తున్నారంటూ ఎల్లో మీడియా ద్వారా దుష్ప్రచారానికి ఒడిగట్టారు. వాస్తవ పరిస్థితి తెలిసిన వారు మాత్రం కాలవ తీరును తప్పుబడుతున్నారు.

అసలేం జరిగిందంటే..

ఇసుక రవాణా చేస్తున్న టిప్పర్‌ను గత నెల 13న బళ్లారి గ్రామీణ పోలీసుస్టేషన్ పరిధిలోని హలకుంది వద్ద పట్టుకుని.. కేసు నమోదు చేశారు. డ్రైవర్ తిప్పేస్వామి నాయక్‌ను అరెస్ట్ చేశారు. బళ్లారి తాలూకా పరిధిలోని కమ్మరచేడు నుంచి ఇసుకను తవ్వి తీసుకొస్తుండగా పట్టుకున్నట్లు బళ్లారి గ్రామీణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నిరంజన్ తెలిపారు. టిప్పర్‌లో ఇసుక నింపిన వ్యక్తి ప్రదీప్ అని తెలిసిందని, అతన్ని పట్టుకున్న తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఆయన చెప్పారు. బళ్లారి నగరంలోని గుగ్గరహట్టిలో ఉండే ప్రదీప్ టీడీపీ సానుభూతిపరుడు. కాలవ శ్రీనివాసులుకు సన్నిహితుడని కూడా తెలుస్తోంది. వాస్తవ పరిస్థితి ఇలా ఉండగా ఈ ఇసుక రవాణాతో కాపు రామచంద్రారెడ్డి అనుచరులకు సంబంధం ఉందంటూ కాలవ ఆరోపణలు చేశారు. చివరకు టీడీపీ వారు ఇసుక దందా చేసినా అది ఎమ్మెల్యే అనుచరులే చేశారంటూ దుష్ప్రచారం చేస్తూ రాజకీయ ప్రయోజనం పొందాలని చూస్తున్నారు. వాస్తవానికి టీడీపీ హయాంలో కాలవ రాయదుర్గం నియోజకవర్గంలో విచ్చలవిడిగా దందాలు సాగించారు. ఎన్నో అవినీతి, అక్రమాలతో పాటు ఇసుక, మట్టి తవ్వకాల ద్వారా కోట్లాది రూపాయలు వెనకేసుకున్నట్లు విమర్శలు ఉన్నాయి. ఈ కారణంగానే గత ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజలు ఆయన్ను ఓడించారు. మళ్లీ ఎలాగైనా ప్రజల్లో సానుభూతి పొందాలన్న ఆరాటంతో ఇప్పుడు అధికార పార్టీ నేతలపై దుష్ప్రచారానికి ఒడిగట్టారు. కాలవ అనైతిక రాజకీయంపై నియోజకవర్గ ప్రజలు మండిపడుతున్నారు.

నేడు మంత్రి ఉషశ్రీచరణ్ పర్యటన

కళ్యాణదుర్గం: రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ గురువారం ఉదయం పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఈ మేరకు బుధవారం మంత్రి క్యాంపు కార్యాలయం నుంచి పర్యటన షెడ్యూల్ విడుదలైంది. ఉదయం 7 గంటలకు బ్రహ్మసముద్రం మండలంలోని వేపులపర్తి లక్ష్మీ రంగనాథ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తారు. 10 గంటలకు కళ్యాణదుర్గం పట్టణంలోని టీ సర్కిల్ నుంచి కంబదూరు బైపాస్ వరకు రోడ్డు విస్తరణ, డ్రైనేజీ నిర్మాణ పనులకు గోల్డెన్ బెల్స్ పాఠశాల వద్ద భూమిపూజ చేయనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు శెట్టూరులోని సాయి లక్ష్మీ విద్యానికేతన్ పాఠశాల వార్షికోత్సవంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 3 గంటలకు మంత్రి క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న స్టోర్ డీలర్లు, ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశం నిర్వహించనున్నారు.

నేడు ఆంజనేయ స్వామి రథోత్సవం

కుందుర్పి: మండలంలోని బండమీదపల్లి గ్రామంలో గురువారం ఆంజనేయస్వామి రథోత్సవం నిర్వహించనున్నారు. ఏటా చైత్రశుద్ధ పౌర్ణమి రోజున స్వామి రథోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఉదయం అగ్నిహోమం, కుంమార్చన, మధ్యాహ్నం 12 గంటలకు మడుగు రథోత్సవం, సాయంత్రం దూళోత్సవం సందర్భంగా రథాన్ని భక్తుల సహాయంతో లాగుతారు. బుధవారం స్వామి వారి జల్ది ఉత్సవం, గంగపూజ, గణపతి హోమం తదితర కార్యక్రమాలు చేపట్టారు.

పిల్లలను బాగా చదివించాలి



ఇళ్లను ప్రారంభిస్తున్న ఆర్డీటీ డైరెక్టర్ విశాల ఫెర్రర్

కళ్యాణదుర్గం: ప్రతి ఒక్కరూ పిల్లలను బాగా చదివించాలని ఆర్డీటీ మహిళా విభాగం డైరెక్టర్ విశాల ఫెర్రర్ అన్నారు. మండల పరిధిలోని కుర్లపల్లిలో ఆర్డీటీ ఆధ్వర్యంలో నిర్మించిన 25 పక్కా ఇళ్ల నిర్మాణాలను కళ్యాణదుర్గం డీఎస్పీ శ్రీనివాసులు, హౌసింగ్ డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డి, అనంతపురం రూరల్ సీఐ విశ్వనాథ్ చౌదరి తదితరులు ప్రారంభించారు. ఈ సందర్భంగా విశాల ఫెర్రర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఎంతో బాధ్యతతో ఇంటి నిర్మాణాలను పూర్తి చేసుకున్నారన్నారు. ఎంతో క్వాలిటీతో ఇళ్లను నిర్మించామని ప్రతి ఒక్కరూ వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళ్యాణదుర్గం రీజినల్ డైరెక్టర్ లక్ష్మణరావు, ఏటీఎల్ మీనాక్షి, సీఓలు, సీటీటీలు పాల్గొన్నారు.

11న అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు

రాయదుర్గం: రాయదుర్గం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా ఉన్న ఒక వర్కర్, 7 ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 11న కళ్యాణదుర్గం ఆర్డీఓ కార్యాలయంలో మౌఖిక పరీక్ష (ఇంటర్వ్యూలు) నిర్వహిస్తామని సీడీపీఓ ప్రభావతి బుధవారం తెలిపారు. టీచర్ పోస్టుతో పాటు 4 ఆయా పోస్టులు బ్యాక్‌లాగ్ కావడంతో దరఖాస్తులు రాలేదన్నారు. మిగిలిన మూడు ఆయా పోస్టులకు 16 దరఖాస్తులు వచ్చాయన్నారు. వీరందరికీ కాల్ లెటర్లు పంపుతున్నామని తెలిపారు.

జోగిని వ్యవస్థ రూపుమాపేందుకు కృషి



నూతన గృహ నిర్మాణాలకు భూమి పూజ చేస్తున్న ఏఎస్పీ నాగేంద్రుడు

కంబదూరు: ఆర్డీటీ సహకారంతో జోగిని వ్యవస్థను రూపేందుకు కృషి చేస్తున్నట్లు అడిషనల్ ఎస్పీ నాగేంద్రుడు పేర్కొన్నారు. కంబదూరు మండలం ములకనూరులో జోగినిలకు నూతనంగా మంజూరైన గృహాలకు ఆర్డీటీ సహకారంతో నిర్మాణాలు చేపట్టారు. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై భూమిపూజ చేసి, మాట్లాడారు. అందరితో సమానంగా జోగినిలకూ నివాసయోగ్యమైన గృహాలు ఉండాలన్న ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప ఆశయానికి ఆర్డీటీ సహకారం తోడైందన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసులు, సీఐలు విశ్వనాథ్‌చౌదరి, శ్రీనివాసులు, ఎంపీపీ తిమ్మరాజమ్మ, సర్పంచ్ లక్ష్మీదేవమ్మ, ఆర్డీటీ హౌసింగ్ డైరెక్టర్ రాజశేఖరరెడ్డి, రీజనల్ డైరెక్టర్ లక్ష్మణరావు, ఎస్ఐ రాజేష్, ఏటీఎల్ జయచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందు, పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఐరావతంపై ఊరేగిన శివపార్వతులు



కూడేరు: జోడు లింగాల శివపార్వతుల సంగమేశ్వరుడి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. అందులో భాగంగా బుధవారం రాత్రి వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో ఐరావత వాహనంపై పార్వతీ పరమేశ్వరుడు భక్తులకు దర్శనమిచ్చాడు. రాత్రి 8:30 గంటలకు పార్వతీ పరమేశ్వరులను ఆంజనేయ స్వామి ఆలయం నుంచి గ్రామ పురవీధుల్లో మంగళ వాయిద్యాల నడుమ ఘనంగా ఊరేగించారు. ఈ సందర్భంగా వాల్మీకి కులస్తులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు శివ, మహేష్, బసన్న గౌడ పాల్గొన్నారు.

వాహనం బోల్తా: ముగ్గురికి గాయాలు

రాయదుర్గం: బళ్లారి–బెంగళూరు జాతీయ ప్రధాన రహదారిపై డి హీరేహాళ్ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బళ్లారి జిల్లా బెణికల్లుకు చెందిన ముగ్గురు రైతులు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్ఐ రామకృష్ణారెడ్డి తెలిపిన వివరాల మేరకు.. రైతులు ఎండు మిర్చి లోడ్‌తో కర్ణాటకలోని బ్యాడిగి మార్కెట్‌కు మహేంద్ర లగేజ్ వాహనంలో బయలుదేరారు. డి హీరేహాళ్ సమీపంలోకి వాహనం రాగానే టైర్ పక్చర్ అయింది. దీంతో వాహనం అదుపుతప్పడంతో బస్తాలపై కుర్చున్న ముగ్గురు రైతులు గాయాలపాలై, త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. పోలీసులు అక్కడికి చేరుకుని స్థానికుల సహకారంతో చికిత్స నిమిత్తం క్షతగాత్రులను బళ్లారి మిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జగ్జీవన్ రామ్ జీవితం స్ఫూర్తిదాయకం



కళ్యాణదుర్గం: జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

కళ్యాణదుర్గం/వజ్రకరూరు/ఉరవకొండ: నిరుపేద కుటుంబంలో పుట్టి దేశ రాజకీయాలను శాసించే శక్తిగా ఎదిగిన బాబూ జగ్జీవన్ రామ్ జీవితం నేటి తరానికి స్ఫూర్తి దాయకమని మంత్రి ఉషశ్రీచరణ్ అన్నారు. బాబూ జగ్జీవన్ రామ్ జయంతిని పురస్కరించుకుని బుధవారం కళ్యాణదుర్గంలోని బళ్లారి మిట్టపై ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే ఉరవకొండ, వజ్రకరూరు మండల కేంద్రాల్లో జగ్జీవన్ రామ్‌కు వైఎస్సార్‌సీపీ నాయకులు నివాళులర్పించారు.

ఉచిత రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలు

రాయదుర్గంటౌన్: గుడ్‌ఫ్రైడే పర్వదినాన్ని పురస్కరించుకుని కేఎస్‌సీసీఎం ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత రక్త గ్రూపు నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. పట్టణంలోని రాజీవ్‌గాంధీ కాలనీలో ఉన్న కింగ్ ఆఫ్ షాలేమ్ క్రైస్ట్ చర్చిలో దీవెన క్లినికల్ ల్యాబ్ సహకారంతో శిబిరం జరిగింది. దాదాపు 200 మంది రక్తగ్రూపు పరీక్షలు చేయించుకున్నారని పాస్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్లు మమత, శ్రీనివాస్, చర్చి అభివృద్ధి మండలి సభ్యులు మురళి, గోపిచంద్, రామాంజి తదితరులు పాల్గొన్నారు.